క్లుప్తంగా

టిడ్కో గృహాలు త్వరితగతిన ఇవ్వాలని వినతి



రేపల్లె రూరల్: పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణ పనులు ప్రారంభించి, త్వరగా లబ్ధిదారులకు గృహాలను పంపిణీ చేయాలని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ కోరారు. మున్సిపల్ కమిషనర్ విజయ సారథికి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో టిట్కో లబ్ధిదారులు డి.సాంబశివరావు, ఎం. పార్వతి, కృష్ణవేణి, దాసరి రమణ, నాగేశ్వరమ్మ, శ్రీరాములు, డి.లలిత, ముసలయ్య పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో ఆక్రమణల తొలగింపు



బాపట్ల అర్బన్: మండలంలోని సూర్యలంక తీరాన ఆక్రమణలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. ఖాజీపాలెం, చీరాల, నిజాంపట్నం గ్రామాలతోపాటు బాపట్ల పట్టణానికి చెందిన సంచార జాతుల వారు సుమారు 20 మంది సూర్యలంక తీరాన గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరు గుడిసెలు ఏర్పాటు చేసుకున్న ప్రాంతం పర్యాటక శాఖకు చెందినది కావడంతో అధికారులు రెండు నెలల క్రితం నోటీసులు ఇచ్చారు. ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరారు. అయినప్పటికీ ఎవరూ ఖాళీ చేయకపోవడంతో ఆక్రమణలను తొలగించారు. ఇప్పటి వరకు పది గుడిసెలు తొలగించామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

వేమూరు: జగనన్న గోరు ముద్దలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ-2 డి.రోజ్ ల్యాండ్, ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, సీఆర్పీ వేణు ఉన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

చుండూరు(వేమూరు): విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వినియోగదారులపై కేసులు నమోదు చేసినట్లు విద్యుత్ విజిలెన్స్ అధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. తెనాలి డివిజన్‌లోని చుండూరు సెక్షన్ పరిధిలో 60 ప్రత్యేక బృందాలు బుధవారం తనిఖీలు చేపట్టాయి. అధిక లోడు వినియోగిస్తున్న 162 సర్వీసులు, మాల్ ప్రాక్టీస్ చేసిన వినియోగదారులకు రూ.6,12,900 జరిమానా వేశారు. వినియోగ దారుల నుంచి వసూళ్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు వీవీ చిరంజీవి, వెంకటేశ్వరరావు, అశోక్ కుమార్, కె.రాజశేఖర్, ఎస్.భాస్కరరావు, పి.మల్లికార్జునరావు, డి.అర్జునరావు పాల్గొన్నారు.

15న మండల పరిషత్ సమావేశం

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాసరి రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ యారం వనజ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని న్యూ వేమవరం ఛానల్ కట్టపై ఉన్న తాగునీటి సరఫరా మోటారు మరమ్మతులకు గురి కావడంతో గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం వాటిల్లిందని గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి బుధవారం తెలిపారు. దీంతో భట్టిప్రోలు దళితవాడ, కూరగాయల మార్కెట్, అద్దేపల్లి రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా ఆయా ఏరియాలలో నీటి సరఫరా చేయలేదని చెప్పారు. గురువారం కొత్త మోటార్ బిగించి సాయంత్రం కల్లా తాగునీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు రూరల్: వ్యసనాలకు బానిసై, తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం 2వ లైనుకు చెందిన విప్పె సాయికృష్ణ చరణ్ వ్యసనాలకు బానిసై గంజాయి విక్రయాలకు పాల్పడుతుంటాడు. విజయవాడలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి నగర శివారులో లింగాయపాలెం ప్లాట్ల వద్ద కూలీలు, డ్రైవర్లు, విద్యార్థులకు పొట్లం రూ. 400కు విక్రయిస్తుంటాడు. లింగాయపాలెం ప్లాట్లలో సాయికృష్ణ గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. అతడి వద్ద నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు.

జగనన్న సురక్ష- ప్రతి కుటుంబానికి రక్ష

ఎమ్మెల్యే కోన రఘుపతి



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: జగనన్న సురక్ష ప్రతి కుటుంబానికి రక్ష అని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేట, నరాల శెట్టివారిపాలెంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రజలకు ముఖ్యమైన 11 రకాల సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. కరోనా లాంటి కష్ట కాలంలో కూడా జగన్ ఇచ్చిన మాట తప్పకుండా ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన సంగతి గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు చేస్తానన్న డ్వాక్రా మహిళల రుణమాఫీ కూడా ఓట్ల కోసం ఎలక్షన్లకు ఆరు నెలల ముందు పసుపు కుంకుమ అనే పేరుతో రూ.10వేలు అది ఒకసారి కాకుండా మూడు విడతలుగా జమ చేసిన సంగతి గుర్తు చేశారు. ప్యాడిసన్ పేట సచివాలయ పరిధిలో 1144 దరఖాస్తులు రాగా 1124 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నరాలశెట్టి వారి పాలెం సచివాలయం పరిధిలో 933 దరఖాస్తులు రాగా 931 ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు కమిషనర్ ఏ భానుప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, జేసీఎస్ కన్వీనర్ చింతల రాజశేఖర్ లతో పాటు ఇనగలూరి మాల్యాద్రి, బుల్లి శ్రీనివాస్ రెడ్డి, సాంబ చెన్నకేశవులు, ఆట్ల ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసకోవాలని తహసీల్దార్ డి.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని మోర్లవారిపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే వాటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు 580 మంది సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచి లక్ష్మీ తిరుపతమ్మ, ఎంపీటీసీ అలివేలుమంగమ్మ పాల్గొన్నారు. అదే విధంగా నల్లూరు నార్త్ గ్రామంలో ఎంపీడీఓ శివపార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 601 సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. పట్టణంలోని గరికపాటివారి వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిలు వీరెళ్ల అంజిబాబు, సింహాచలం పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులు బడుగు జస్వంత్ కుమార్, చల్లా హన్సిక, భూపతి దయానాలకు బుధవారం పెద్దలు రూ. 3 వేలు నగదు బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు కొసరాజు రమేష్, కొమ్మినేని శ్రీమన్నారాయణ, గుత్తా వెంకటేశ్వరరావు ఈ నగదును అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థి బడుగు జస్వంత్ కుమార్‌కు నగదు బహుమతి అందజేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ పథకాలను అడ్డుకునేందుకు టీడీపీ కుట్రలు

వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వాటికి వస్తున్న ఆదరణ చూసి టీడీపీ ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని బలుసులపాలెం మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎం.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులతో ఘర్షణకు దిగునట్లు ఆరోపించారు. సర్పంచి కొనకళ్ల నాగమల్లేశ్వరి, కుమారుడు కొనకళ్ల రవి, కాటూరి తిరుపతయ్య మరి కొందరు గ్రామంలోని లబ్ధిదారులను సురక్ష కార్యక్రమానికి రానివ్వకుండా అడ్డుకుని దౌర్జన్యం చేసినట్లు చెప్పారు. సర్పంచి సీటులో కూర్చున్నట్లు అసత్య ప్రచారం చేసినట్లు చెప్పారు. సర్పంచి కుమారుడు కొనకళ్ల రవి ప్రజను నమ్మించి ఉద్యోగాలు, గ్యాస్, పెట్రోల్ ఏజెన్సీలు ఇప్పిస్తానంటూ ఎంతో మందిని మోసం చేసినట్లు ఆరోపించారు. దౌర్జన్యానికి దిగిన టీడీపీ నాయకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, తూము కోటేశ్వరరావు, బండారు రామారావు, చీరాల శివరామకృష్ణారెడ్డి, తురిమెళ్ల శ్రీధర్, బడుగు చంద్రపాల్, కూరేటి రాము పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి వ్యాపారులు!

బాపట్ల టౌన్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి వ్యాపారం చేసి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులపై జిల్లా పోలీసులు నిఘా పెట్టారు. మార్టూరు, చీరాల పరిధిలోని కొందరు వ్యాపారులు, గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో జిల్లా పోలీస్ బాస్ సీరియస్ అయ్యారు. నిత్యం గంజాయి విక్రయిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై కేసు

బాపట్లటౌన్: నిశ్చితార్థం చేసుకొని పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పట్టణంలోని మూర్తిరక్షణ నగర్‌కు చెందిన ఓ యువతికి రెండు నెలల క్రితం చెన్నైకి చెందిన మురళీకృష్ణతో నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం చేసుకొని పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రఫీ కేసు నమోదు చేశారు.

లారీ కింద పడి వృద్ధుడి మృతి

చదలవాడ(వేమూరు): చదలవాడ గ్రామం సెంటరులో కాకర్లమూడి రోడ్డు మలుపు వద్ద పది చక్రాల లారీ కింద పడి వృద్ధుడు యల్లమాటి ఆనందరావు(67) మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు.. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామానికి చెందిన యల్లమాటి ఆనందరావు ఒంటరిగా జీవిస్తున్నాడు. అతడికి చెల్లెలు, అన్నదమ్ములు ముగ్గరు ఉన్నారు. చెల్లెలు మరియమ్మను చదలవాడ గ్రామం ఇచ్చారు. ఆనందరరావు వృద్ధాప్యంతో ప్రతి నెల 10 రోజులు చెల్లెలు వద్ద మిగిలిన రోజులు అన్నదమ్ములు వద్ద ఉంటాడు. చెల్లెలు వద్ద ఉంటున్నాడు. బుధవారం చదలవాడ సెంటరులో హోటల్‌లో టిఫిన్ చేసి కాకర్లమూడి రోడ్డు మలుపు వద్ద నిలబడి ఉన్నాడు. పది చక్రాలు లారీ మలుపు వెళ్తుండగా వెనుక భాగం తగిలి వెనుక చక్రాలు కింద పడి పోయాడు. దీంతో రెండు కాళ్లు విరిగి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం పలువురు పోలీసుల కుటుంబాలకు అధికారులు చెక్కులు అందజేశారు. పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్ఐగా విధులు నిర్వర్తించే వెంకట్రావు బ్రెయిన్ స్ట్రోక్‌తో గతనెల ఆరో తేదిన మృతి చెందారు. ఈ మేరకు విడోఫ్లాగ్ ఫండ్ కింద మంజూరైన రూ.50 వేల చెక్కుని వెంకట్రావు భార్య శ్రీదేవికి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. తెనాలి సబ్ డివిజన్ పీసీఆర్‌లో సీఐగా విధులు నిర్వర్తించే ఎ.శ్రీనివాసరాజు, మంగళగిరి పట్టణ పీఎస్ కానిస్టేబుల్ కె.మాధవరావు, నార్త్ సబ్ డివిజన్ మంగళగిరిలో హెచ్‌సీ పి.శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో బుధవారం శ్రీనివాసరాజు భార్య ప్రతిభారాణి, మాధవరావు భార్య స్వర్ణ, శ్రీనివాసరావు భార్య నాగమణిలకు రూ.1 లక్ష చెక్కులను ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అందించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, డీపీవో మినిస్టీరియల్ -బి సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

గుంటూరు ఈస్ట్: విద్యుత్ ఘాతానికి గురై లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడుకు చెందిన మిరియాల శ్రీనివాస్ లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గుంటూరులోని అశోక్‌నగర్ 4వ లైనులో లారీని రోడ్డు పక్కన నిలిపాడు. కొంతసేపటి తర్వాత లారీ ఎక్కే క్రమంలో డోరు పైభాగం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురై ఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి

జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి

ప్రత్తిపాడు: ప్రభుత్వ లక్ష్యాల మేరకు గృహ నిర్మాణాల్ని పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈవోపీ ఆర్డీ మావులూరి మోషె అధ్యక్షతన గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో లబ్ధిదారులకు గృహ నిర్మాణంపై విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జగనన్న కాలనీల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నిర్మాణాలకు ముందుకు వచ్చే లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నగదుతో పాటు అదనంగా వైఎస్సార్ క్రాంతి పథం నుంచి రూ. 30 వేలను ఇస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభించిన లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీరమ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో ఆర్. కేశవరెడ్డి, ఎంపీడీవో శ్రీరమ్య

నేడు, రేపు ఐటీ ఫైలింగ్‌పై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆదాయపు పన్నుశాఖ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సంయుక్తంగా గురు, శుక్రవారాల్లో ఐటీ ఫైలింగ్‌పై ఉచిత అవగాహన, సలహా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ మద్ది రవితేజ బుధవారం తెలిపారు. వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులు, పెన్షనర్లకు ఎంతో కీలకమైన ఐటీ ఫైలింగ్‌పై సందేహాలను నివృత్తి చేసేందుకు అనుభవజ్ఞులైన సీఏలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. శ్రీనివాసరావు పేట 60 అడుగుల రోడ్డులోని ఐసీఏఐ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు జరిగే శిబిరంలో ఐటీ ఫైలింగ్‌పై జరిగే శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఉపాధ్యాయులకు జేసీ రాజకుమారి హెచ్చరిక



గుంటూరు రూరల్: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయుల్ని జేసీ రాజకుమారి హెచ్చరించారు. మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డుల్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటంపై ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. విధుల్లో ఆలసత్వం వహించవద్దని అధ్యాపకులకు సూచించారు. గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ సంవత్సరం ఇంటర్మీడియేట్ కాలేజీల్లో చేరారో.. లేదో ? సమాచారం సేకరించాలని సూచించారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని ''చైల్డ్ ఇన్ఫో వెబ్ సైట్''లో నమోదు చేసింది.. లేనిది? ఆరా తీశారు. ఇంకా నమోదు చేయని విద్యార్థులు ఉంటే వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద నాణ్యత గురించి విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. జగనన్న విద్యకానుక పంపిణీ వివరాలు, నాడు -నేడు పనుల పురోగతిపై సమీక్ష జరపాలని హెచ్ఎంని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, హెచ్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో సమగ్ర గైనకాలజీ సేవలు

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజీ సేవల్ని ప్రజలు వినియోగించుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ జె. హనుమంతరావు సూచించారు. ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. వైద్యసేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఓపీ, డాక్టర్ రికార్డులతో పాటు ఫార్మసీ రికార్డుల్ని పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యాధికారుల అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైన సిబ్బందికి వెంటనే మెమోలు జారీ చేయాలని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ నాగార్జునకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ సీహెచ్‌సీలో ప్రభుత్వం అన్ని విభాగాలకు వైద్యుల్ని నియమించిందని తెలిపారు.

వలంటీర్ రుణం తీర్చుకోలేం...



కావూరి బాపమ్మ

వలంటీర్ రుణం తీర్చుకోలేను. నా భర్త పుల్లారెడ్డికి కరోనా సోకటంతో నా భర్తను, నన్ను డాక్టర్లు 108లో గుంటూరులోని పెద్దాస్పత్రికి తరలించారు. వారం రోజులు అక్కడే ఉంచారు. ఇంటి వద్ద మా ముసలమ్మ, నా కొడుకు కూతురే ఉన్నారు. మా పిల్లన్ని ఎవరూ పలకరించకపోయినా మా వలంటీర్ మా ఇంటికి వచ్చి మా పిల్లల బాగోగులు చూశాడు. మా బంధువులు ఇంటికి రావటానికి కూడా భయపడ్డారు. మా వలంటీర్ కావూరి శివారెడ్డి ప్రతిరోజూ మా ఇంటికి వచ్చి మాకు కావలసిన కూరగాయలు, సరుకులు తీసుకువచ్చి మా ఇంటి వద్ద ఇచ్చి వెళ్లేవాడు. ఆ సమయంలో వలంటీరే మాకు దేవుడిలా కనిపించాడని బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం శ్రీరామ్‌నగర్ గ్రామానికి చెందిన కావూరి బాపమ్మ గుర్తుచేసుకున్నారు. -కర్లపాలెం

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్



గణపవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తున్న జేసీ శ్రీధర్

కర్లపాలెం: పదో తరగతి తప్పిన విద్యార్థులు కూడా రెగ్యులర్ విద్యార్థులతో కలసి పాఠశాలల్లో చదువుకోవాలని బాపట్ల జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. చింతాయపాలెం, గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించారు. గతంలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరి చదువుకునేందుకు అడ్మిషన్ల ఫారాలు అందజేశారు. జేసీ మాట్లాడుతూ విద్యార్థులెవరూ బడి బయట తిరగకుండా వారు చదువు కొనసాగించేందుకు ప్రభుత్వం ఫెయిలైన విద్యార్థులను కూడా పాఠశాలల్లో చేర్చుకుని వారికి అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం లాంటి పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఇటీవల 10వ తరగతి ఫెయిలైన విద్యార్థులు జాయింట్ కలెక్టర్ సమక్షంలో చింతాయపాలెం పాఠశాలలో ముగ్గురు, గణపవరం పాఠశాలలో 8మంది విద్యార్థులు చేరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేశవ నారాయణరావు, గణపవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం నూతలపాటి శ్రీనివాసరావు, చింతాయపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం తోట వెంకటరాజు ఉన్నారు.

వేమూరు: పదో తరగతి తప్పిన 21 మంది విద్యార్థులను మళ్లీ పాఠశాలలో చేర్పించినట్లు మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మిగిలి ఉన్న విద్యార్థులను కూడ చేర్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారులు వనజా, విజయ, ఎంపీడీఓ శ్రీనివాసరరావు, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, ఎంఈఓ-2 రోజ్ ల్యాండ్ పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో..

కర్లపాలెం: ఫెయిలైన విద్యార్థులు చదువు కొనసాగించేందుకు తిరిగి వారిని అదే పాఠశాలలో చేర్పిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి సువార్త తెలిపారు. బుధవారం మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓలు పదో తరగతి ఫెయిలైన ఐదుగురు విద్యార్థులను పదో తరగతిలోనూ, ఇద్దరు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను 8వ తరగతిలోనూ చందోలు నీలి బంగారయ్య ఉన్నత పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మారుతీ శేషమాంబ, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, రాజారత్నం పాల్గొన్నారు.

మేలైన వంగడాలతో అధిక దిగుబడులు

ఎమ్మెల్యే కోన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: నాణ్యమైన వంగడాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని నరసాయపాలెంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సదస్సు బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుకు అనువైన రకాలను శాస్త్రవేత్తల సూచనల మేరకు సాగు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పూర్తిగా రైతులకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. సన్న రకాలను కనీస మద్దతు ధరకు రైతుల వద్ద కొనుగోలు చేస్తామన్నారు. బాపట్ల వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కృష్ణవేణి మాట్లాడుతూ ఏడాదిలో రెండు పంటలు సాగు చేసే వారు బీపీటీ 5204, బీపీటీ 2846, ఎంటీయూ 1224, బీపీటీ 2782 రకాలను సాగు చేయాలని సూచించారు. ఒక పంట పండించే వారు బీపీటీ 2270, బీపీటీ 2595, ఎంటీయూ 1262 మేలని చెప్పారు. జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం శ్రీలక్ష్మి మాట్లాడుతూ రైతులు పండించిన సన్న రకాలు గ్రేడ్ -ఏ కింద, ఇతర రకాలను కామన్ రకం కింద ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, బాపట్ల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ప్రసాద్, మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ బాపట్ల మండల కన్వీనర్ కోకి రాఘవ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వడ్డిముక్కల డేవిడ్, ఇరిగేషన్ సాంబశివరావు, బాపట్ల ఏడీఏ లక్ష్మి, డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు సురేఖ, బాపట్ల వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సాంబశివరావు, బాపట్ల రైస్ డీలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రజల్లో అశాంతి

మాజీ మంత్రి జేడీ శీలం



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శీలం, వేదికపై కాంగ్రెస్‌పార్టీ నేతలు

బాపట్ల అర్బన్: బీజేపీ నేతలు దేశంలోని అన్ని వర్గాల ప్రజల్లో అభద్రతా భావం కలగజేయడమే అజెండాగా పెట్టుకున్నారని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జేడీ శీలం పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం మైనార్టీ సదస్సు నిర్వహించారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు నేతృత్వంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ ద్వంద వైఖరిపై ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాష్ట్ర మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాదా పిర్ గాంధీ, రహమత్ ఆలి, పట్టణ అధ్యక్షుడు దొనెపూడి దేవరాజ్, పీసీసీ అధికార ప్రతినిధి వేంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు తోట శివనాగేశ్వర రావు, జిల్లా కార్యదర్శి ముజురిన్నిసా పాల్గొన్నారు.